ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



వేడుకలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి, కార్యకర్తలు

నిజాంపేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, అవిజె జేమ్స్, కృష్ణ, శ్రీనివాస్, గడ్డం రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ నీలారెడ్డి ఆధ్వర్యంలో..

నిజాంపేట్‌లో మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు, చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, ఆవుల పావని, రాజేశ్వరిచౌదరీ, ఆవుల ప్రసన్న, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు తలారి వీరేశ్, నాయకులు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్య చౌదరీ, ఆవుల జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వినతి



తహసీల్దార్ ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పను ఆనుకుని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రెహమాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గృహకల్ప బ్లాక్‌లను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలో నిర్మాణాలు చేపడితే అధికారులు కూల్చివేశారని, ప్రస్తుతం అదే ప్రాంతాల్లో ప్లాట్లు చేసి విక్రయాలు చేపడుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించని పక్షంలో హైడ్రాకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరినాథ్, రాములు, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీ వాంట్ మెట్రో..!

మెట్రోను మేడ్చల్ వరకు అందుబాటులోకి తేవాలి

ట్రాఫిక్ నివారణకు అదొక్కటే మార్గం

మెట్రో సాధన సమితి పేరుతో ఆందోళనలు

ఇప్పటికే సీఎం, గవర్నర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేత

కొంతకాలంగా నగర ఉత్తర దిక్కులో జనాభా విపరీతంగా పెరిగింది. అందుకనుగుణంగా అక్కడ వ్యాపార సముదాయాలు కూడా బాగా పెరిగాయి. అంతే కాకుండా ఎక్కువ శాతం ఐటీ ఉద్యోగులు కూడా అక్కడే ఉన్నారు. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిందే మొదలు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఉద్యోగాలకు సరైన సమయానికి వెళ్లలేకపోతున్నారు. దీంతో ఇక్కడ మెట్రో సేవలు అందుబాటులోకి తీసుకొస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అందరూ ఏకతాటికిపైకి వచ్చి వీ వాంట్ మెట్రో నినాదాన్ని అందుకున్నారు.



జీడిమెట్ల: హైదరాబాద్ ఉత్తర దిక్కులో జనాభా రోజురోజుకూ పెరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే మేడ్చల్‌కు మెట్రోను తీసుకొస్తేనే కొంతమేరైనా ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి వారు (వీ వాంట్ మేడ్చల్ మెట్రో) ప్రభుత్వం పట్టించుకుని మెట్రో రెండో ఫేజ్‌లో కచ్చితంగా మేడ్చల్ వరకు మెట్రో రైలు మార్గం వేయాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మెట్రో కోసం వీరంతా మేడ్చల్ మెట్రో సాధన సమితిని ఏర్పా టు చేసి మెట్రో సాధన కోసం కేంద్రమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, ఎమ్మెల్యేలను కలిసి ఇప్పటికే వినతిపత్రాలను అందజేశారు. ఏదీ ఏమైన మెట్రో సాధించే వరకు పోరాటం ఆపబోమని ఇక్కడ ప్రజలు తెగేసి చెబుతున్నారు. లాస్య ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఎండీ వెంకట్‌యాదవ్ ఏకంగా ఆన్‌లైన్ ద్వారా సంతకాల సేకరణ చేయగా ఇప్పటికే దానిపై 25 వేల మంది సంతకాలు చేశారు.

ఐదు సంవత్సరాల్లో పెరిగిన ట్రాఫిక్

హైదరాబాద్‌కు ఉత్తరభాగమైన సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు గత ఐదు సంవత్సరాలుగా విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీనికి ప్రధాన కారణం ఇక్కడ పెద్ద పెద్ద కళాశాలలు, కన్వెన్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు, పరిశ్రమలు ఉండటమే గాక ఇటీవల ఇక్కడ పెరిగిన గేటెడ్ కమ్యూనిటీస్, అపార్ట్‌మెంట్స్, హోటళ్లు ఇలా విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రతినిత్యం సుచిత్ర నుంచి కొంపల్లి వరకు ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. సుచిత్ర, విలేజ్ జీడిమెట్ల, దూలపల్లి సిగ్నల్స్‌లో ట్రాఫిక్ సమయాల్లో ఒక్కోసారి 15 నిమిషాలు ఆగాల్సి వస్తుందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. ఇక్కడ నుంచి దాదాపు ప్రతినిత్యం 50 నుంచి 60 వేల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైటెక్‌సిటీ వెళ్తుంటారు. వీరంతా ఆఫీసుకు చేరుకోవాలంటే ట్రాఫిక్‌లో కనీసం రెండు గంటల సమయం పడుతుందని వీరు వాపోతున్నారు. మాకు ఈ ట్రాఫిక్ కష్టాలు పోవాలంటే తప్పనిసరిగా మెట్రోను అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.

నత్తనడకన సాగుతున్న ఫ్లైఓవర్ పనులు..

ట్రాఫిక్ సమస్యకు తోడు గత ప్రభుత్వం ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో రోడ్లపై మెషీన్‌లు ఉంచి డైవర్షన్‌లు పెట్టడంతో ట్రాఫిక్ సమస్య మరింతగా జఠిలంగా మారిందని కొంపల్లి వాసులు అంటున్నారు.

ఆన్‌లైన్‌లో 25వేల పైచిలుకు మంది సంతకాలు



గత సంవత్సరకాలంగా మా ప్రాంతానికి మెట్రో వేయాలని ఆన్‌లైన్ ద్వారా సంతకాల సేకరణ మొదలుపెట్టాను. ఇప్పటికే దీన్ని సమర్థిస్తూ 25 వేల పైచిలుకు ఇక్కడి ప్రజలు సంతకాలు చేశారు. దీనిని బట్టి చూస్తే ఇక్కడి ప్రజలకు మెట్రో అవసరం ఎంత ఉందో ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకుని మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలి.

వెంకట్ యాదవ్
(లాస్య సొల్యూషన్స్ ఎండీ)

ప్రజల డిమాండ్‌కనుగుణంగా మెట్రో సేవలుండాలి



ప్రస్తుతం సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు స్థలాలు, ఇళ్ల ధరలు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీనికి ప్రధాన కారణం ఇక్కడ స్కూళ్లు, కళాశాలలు, కన్వెన్షన్స్, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్, పరిశ్రమలు ఉండటమే దీంతో ప్రజలు నగరవాసులు ఇటువైపు స్థిరపడుతున్నారు. కాబట్టి ప్రజల డిమాండ్‌కు తగినట్లుగా ప్రభుత్వం మేడ్చల్ మెట్రో విస్తరణ చేపట్టాలి.

రేవతి
(జీడిమెట్ల గ్రామం)

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెట్రో ఒక్కటే మార్గం



ప్రస్తుతం హైదరాబాద్ ఉత్తరదిక్కు రోజురోజుకూ పెరుగుతుంది. సుచిత్ర మొదలుకొని మేడ్చల్ వరకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరుగుతుంది. దీనికి చెక్ పెట్టాలంటే మేడ్చల్ మెట్రో విస్తరణ ఒక్కటే మార్గం. అందుకే మేడ్చల్ మెట్రో విస్తరణ లక్ష్యంగా మెట్రో సాధన సమితిని ఏర్పాటు చేశాను.

సంపత్‌రెడ్డి
(మెట్రో సాధన సమితి అధ్యక్షుడు)..

ట్రాఫిక్ వల్ల జర్నీకే 4 గంటలు పడుతుంది..



ఇక్కడ నుంచి ప్రతిరోజూ దాదాపు 50 నుంచి 60వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు హైటెక్‌సిటీకి వెళ్తున్నాం. మెట్రో లేకపోవడం వల్ల ఆఫీసుకు చేరుకోవాలంటే మాకు రెండు గంటల సమయం జర్నీకే పడుతుంది. ప్రతిరోజూ రానుపోను నాలుగు గంటల సమాయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. మాకు మెట్రో ఏర్పాటు చేస్తే కేవలం 40నిమిషాల్లో ఆఫీసుకు చేరుకుంటాం.

స్నితిక (జీడిమెట్ల, సాఫ్ట్‌వేర్)

ఎప్పుడూ బస్సులు రద్దీగా ఉంటున్నాయి



మెట్రో లేకపోవడం వల్ల సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వచ్చే బస్సులు ప్రయాణికులతో నిండుగా వస్తున్నాయి. దీంతో కొన్ని స్టాపుల్లో అసలు బస్సులను ఆపడం లేదు. ఇలా అయితే మేము పనుల నిమిత్తం బయటకు వెళ్లిరావాలంటే పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వం మేడ్చల్ వరకు మెట్రో విస్తరించాలి..

మాధురి (కొంపల్లి)

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని త్వరితగతిన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. స్మార్ట్‌సిటీ పేరుతో ఎంత అభివృద్ధి జరుగుతుందో అంతే అభివృద్ధి నగరం ఉత్తర వైపు ప్రాంతాన్ని కూడా చేయాలని పేర్కొంటున్నారు.



సాక్షితో సమస్యను వివరిస్తున్న స్థానికులు



కొంపల్లిలో ట్రాఫిక్‌జాం



కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మిథిలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్‌కే లేఅవుట్, బ్లూమ్స్ స్కూల్, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతాల్లో, 11కేవీ ఆర్‌జీకే ఫీడర్ పరిధిలో వాసవీ లేఅవుట్, ఆర్‌జీకే రోడ్డు, సాయిలక్ష్మి లేఅవుట్, న్యూ విజేత సూపర్ మార్కెట్, 11కేవీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు సాయికృష్ణ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రుద్ర విల్లాస్, మనం ఫార్మసీ వెనుక గల్లీలో విద్యుత్ ఉండదన్నారు.

సుభాష్‌నగర్: తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గాజులరామారం విద్యుత్ ఏడీ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ గాజులరామారం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉషోదయకాలనీ, చిత్తారమ్మ ఆలయం ఎదురు గల్లీలు, బాలాజీ లేఅవుట్, రాయల్‌ఫామ్స్, గాజులరామారం గ్రామం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

షాపూర్‌నగర్ సెక్షన్ పరిధిలో..

- 11కేవీ ఐడీఏ సూరారం ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు సాయిబాబానగర్, పాండుబస్తీ, నరసింహ బస్తీ, పుష్పగిరిబస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కృష్ణ పేర్కొన్నారు.

21 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న బాలానగర్ ఏసీపీ హన్మంతరావు

జగద్గిరిగుట్ట: గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు అన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్న 21 మందిని శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తమ సిబ్బంది నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ నరసింహ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

నిజాంపేట్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన డేవిడ్, నరసింహప్రసాద్, పద్మలకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో లాయక్, గణేష్, పెరికె శివ, పండరి, సోమన్నగారి శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణ, పద్మారావు పాల్గొన్నారు.

అనుమానాలుంటే ఫోన్ చేయండి

సాక్షి,సిటీబ్యూరో: ఈ నెల 17,18 తేదీలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షలకు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థుల హాజరు కానున్నారని జిల్లా కలెక్టరు గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే అభ్యర్థులు హెల్ప్ డెస్క్ (040–23542185, 040–23542187)కు ఫోన్ చేయవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని



శారద

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శారద రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించింది. గుర్రంగూడ జీఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ బి. వెంకటయ్య తెలిపారు. ఆమెను ప్రిన్సిపాల్ అభినందించారు.

నీటి కాలువ నిర్మాణం చేపట్టాలి

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శివశక్తి నగర్‌లోని స్ట్రాం వాటర్ డ్రైన్ కుంగిపోయి ఉందని, కాలనీలోకి వచ్చే వరద నీటిని నివారించేందుకు తక్షణమే నీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ పగుడాల శిరీష అన్నారు. ఈ మేరకు శుక్రవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఆఫీసు ఈస్ట్ గేట్ నుంచి శ్రీహరినగర్ వసుంధర హాస్పిటల్ వరకు దెబ్బతిన్న సీసీ రోడ్డుకు నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్ భాస్కర్‌రావు, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పేరుతో బీసీలను మోసగిస్తే ఊరుకోం

కూకట్‌పల్లి: కుల గణన సర్వే పేరుతో బీసీలకు అన్యాయం జరిగితే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టారు. అందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటికి సిబ్బంది స్టిక్కర్ అంటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీ కులగణన సర్వేను స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఎమ్మెల్యేలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అసెంబ్లీలో చర్చించకుండా సొంత నిర్ణయాలతో సర్వే చేపట్టడం సరైన పద్ధతి కాదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బీసీ కుల గణనతో పాటు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, కృష్ణయ్య, డివిజన్ అధ్యక్షులు సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్‌లో..

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలో శుక్రవారం మూడవ రోజు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. సుమారు 4 వేల ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. డివిజన్ పరిధిలో 18 వేల ఇళ్లు ఉండగా మూడు రోజులుగా 12,627 ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు.

జోనల్ కమిషనర్ తనిఖీ

మోతీనగర్: ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు వివరాలు అందజేయాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో స్టిక్కర్ల అంటివేత ప్రక్రియను జోనల్ కమిషనర్ తనిఖీ చేశారు. అల్లాపూర్ డివిజన్‌లో 282 మంది ఇళ్లకు స్టిక్కర్లు అంటించారని ఏఈ రంజిత్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

చింతల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు ఆస్కారముండదని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైకు నడిపే సమయంలో హెల్మెంట్ తప్పక ధరించాలని, రాంగ్‌రూట్, మొబైల్ డ్రైవింగ్ చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. సిగ్నల్ జంపింగ్, సరైన ప్రతాలు లేకుండా వాహనాలు నడిపితే చలాన్‌లతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.



పాల్గొన్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నల్ల జై శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ గోవిందరెడ్డి, వెంకట్ రెడ్డి, రామకృష్ణ, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో ఎలాంటి లోపాలు ఉండకూడదు

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను జాగ్రత్తగా ఎలాంటి లోపాలు జరుగకుండా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా (లోకల్ బాడీస్)అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం నిజాంపేట, దుండిగల్ మున్సిపాలిటీలలో ఆమె పర్యవేక్షించారు. సర్వేలో వివరాలను సేకరించేటప్పుడు కుటుంబ యజమానులు వారి ఆధార్, ఓటర్, అవసరమైన కార్డులను ఎన్యుమరేటర్లకు చూపించేలా ముందుగానే తెలుపాలని రాధికా గుప్తా సూచించారు. అనంతరం దూలపల్లి, బాచుపల్లిలలో గ్రూప్ –3 పరీక్షలకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ కృషి



నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి తదితరులు

నిజాంపేట్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపిన వీఓటీటీ ప్రధాన సంపాదకుడు మాణిక్‌రెడ్డి, జయసింహారెడ్డి మాట్లాడుతూ.. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌ను ఈహెచ్‌ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు వర్తింపజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుత్బుల్లాపూర్ అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోశాధికారిగా నర్సింహులు, కన్వీనర్‌గా సంతోష్, మహిళా అధ్యక్షురాలిగా వసంతలను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్





సాక్షి,సిటీబ్యూరో: ఫీజు బకాయిలు ఉన్నాయని డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే ఫైనల్ ఇయర్ ఎస్సీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారిని ఇబ్బందులు కలిగించవద్దని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల్లో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాల ఆన్‌లైన్ నమోదుపై కాలేజీల ప్రిన్సిపాళ్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్ షిప్పులు కొంత ఆలస్యంగానైనా కాలేజీ అకౌంట్లలో జమ అవుతాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.ప్రతి కాలేజీలో ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించేందుకు బాధ్యత గల సిబ్బందిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, ఏవైనా పొరపాట్లు జరిగితే నోడల్ ఆఫీసర్లదే బాధ్యత అని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ స్పష్టం చేసారు. విద్యార్థుల ఆధార్ నంబర్లను బ్యాంక్ అకౌంట్‌తో సీడింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీజీజీ ప్రతినిధి వినయ్‌కృష్ణ అవగాహన కల్పించారు.

మాదకద్రవ్యాల విక్రేత అరెస్టు

కుత్బుల్లాపూర్: బేకరీలో పనిచేస్తూ మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడిని మేడ్చల్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.4.40 లక్షలు విలువ చేసే ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రం భావ్‌నగర్‌కు చెందిన గులానీ ఆసిఫ్(30) కొంపల్లి ప్రాంతంలో నివాసముంటూ స్థానికంగా ఓ బేకరీలో పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్ విక్రయాలకు తెర లేపాడు. ముంబైలో ఉంటున్న అలీ అనే వ్యక్తి నుండి ఎండీఎంఏ తో పాటు డ్రై గంజాయిని కొనుగోలు చేసి నగరంలోని పలువురికి సోషల్ మీడియా ద్వారా విక్రయాలు చేపడుతూ వస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు గులానీ ఆసిఫ్‌పై నిఘా పెట్టారు. శుక్రవారం కొంపల్లి ప్రాంతంలో తరుణ్ వ్యాస్, మహ్మద్ ఇక్బాల్, సుశాంత్ కుమార్‌రెడ్డిలకు మత్తుపదార్థాలు విక్రయిస్తుండగా ఆసిఫ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుండి రూ.4.40 లక్షలు విలువ చేసే 20 గ్రాముల ఎండీఎంఏతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఆసిఫ్‌పై కేసు నమోదు చేశామని, అదే విధంగా డ్రగ్స్ వాడుతున్న వ్యక్తుల వివరాలు రాబట్టే దిశగా విచారణ చేపట్టామని డీసీపీ కోటిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, మేడ్చల్‌జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి